ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
3
శనివారం 17 ఫిబ్రవరి 2024







'హరితహారం' మొక్కలను సంరక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

- పాలిబ్యాగ్ ఫ్రీ నర్సరీలను తయారు చేయాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 16: జిల్లాలోని మున్సిపాలిటీల్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హరితహారం కార్యక్రమంపై సంబంధితశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హరితహారం కార్యక్రమంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. మొక్కలు జియోట్యాగింగ్ చేయడంతో పాటు వాటికి రీకన్సలేషన్ చేపట్టాలని సూచించారు. మొక్కలను అటవీశాఖ సూచనల మేరకు నాటాలని అన్నారు. జిల్లాలో పెరిగిన మొక్కలను తొలగించాల్సి వస్తే సంబంధిత పంచాయతీ సెక్రటరీ, పీఆర్, లోకల్‌బాడీస్ అధికారుల అనుమతులను ఆయా ఏజెన్సీలు ఖచ్చితంగా పొందాలని ఆదేశించారు. ఇంటింటికి ఇచ్చే మొక్కలలో పూలు, పండ్లు, కూరగాయల మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి ఇంటికి అవసరం మేరకే మొక్కలను ఇవ్వడంతో పాటు ఇచ్చిన మొక్కల సంరక్షణను వారంలో ఒకసారి పర్యవేక్షించాలని తెలిపారు. మల్టిలేయర్, ఇతర మొక్కలకు వాటరింగ్ సక్రమంగా జరుగాలని అన్నారు. హోంస్ట్రీట్ ప్లాంటేషన్ కోసం ప్రైమరీ బెడ్‌లలో మొక్కలను పెంచి జ్యూట్ బ్యాగుల ద్వారా ఇంటింటికి అందించాలన్నారు. పైలెట్‌గా పాలిఫ్రీ నర్సరీలను తయారు చేయడానికి ప్రణాళిక రూపొందించి ఇంటింటికీ మొక్కలను ప్లాస్టిక్ రహిత బ్యాగులు, బ్యానర్లు లేకుండా అందించేలా ప్రణాళిక రూపొందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అటవీశాఖ అధికారి బాలమణి, డీఆర్‌డీవో శ్రీధర్, డీఎఈఈ ప్రియదర్శిని, పీడీ రవీందర్, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్‌పై తొలగని సస్పెన్స్

- కాంగ్రెస్‌లో కొనసాగుతున్న వడబోత
- పలుమార్లు అభిప్రాయ సేకరణపై పార్టీలో అసహనం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ స్థానం నుంచి కాంగ్రెస్ ఎవరిని పోటీలోకి దింపుతుందనే విషయం ఇంకా సస్పెన్స్‌గానే ఉన్నది. అభిప్రాయాల సేకరణ పేరుతో వివిధ స్థాయిల్లో సమావేశాలు నిర్వహిస్తూ నేతల మదిలో ఏముందో తెలుసుకుంటూ గాంధీభవన్ వర్గాలు ఇంకా ఒక అభిప్రాయానికి రాక పోవడం పట్ల ఆ పార్టీశ్రేణుల్లో అసంతృప్తి, అసహనం వ్యక్తమవుతున్నది. ప్రదేశ్ ఎన్నికల కమిటీ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, ఇతర నేతలు పలు దఫాలుగా సమావేశాలు నిర్వహిస్తూనే ఉండడం "కొలువ...కుమ్మరియ్య" అన్న తంతుగా జరుగు తున్నదని అంటున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్టీనేతల సమావేశాలు నిర్వహించి ప్రచారానికి సమాయత్తం చేయడంతో పాటు ప్రజలను వివిధ వర్గాల వారిని కలిసే కార్యక్రమాల్లో నిమగ్నమై నిత్యం పర్యటనలు చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ తన ప్రచారానికి ఎప్పుడో శ్రీకారం చుట్టడంతోపాటు వేములవాడ, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొదటి విడత 119 కిలో మీటర్ల ప్రజాహిత యాత్ర పూర్తిచేశారు. ఆ పార్టీ రాష్ట్ర, జాతీయస్థాయి నేతలు నియోజకవర్గ పరిధిలో పార్టీశ్రేణులను సమాయత్తం చేసేందుకు సమావేశాలు నిర్వహించి కార్యాచరణ అప్పగించి వెళ్లారు.

కాంగ్రెస్ పార్టీ మాత్రం అభ్యర్థి ఎవరన్నది తేల్చకుండా అభిప్రాయ సేకరణకే నెలరోజుల సమయాన్ని తీసుకొని కాలయాపన చేస్తున్నదని పార్టీ ద్వితీయశ్రేణి నేతలు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు సాధించిన ధీమాతో బీఆర్‌ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నది. బీజేపీ అయోధ్య శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠతో ఏర్పడిన సానుకూల వాతావరణాన్ని హిందుత్వ నినాదంతో మరింత బలపడేలా చూసుకుంటూనే అభివృద్ధి నినాదాన్ని, మోదీ పాలనను ప్రజల్లోకి తీసుకవెళ్తున్నది. బీఆర్‌ఎస్‌తో దాదాపు సమానంగా ఓట్లు సాధించిన కాంగ్రెస్‌లో మాత్రం ఇంకా పార్లమెంట్ ఎన్నికల ఉత్సాహమే కనిపించడం లేదు. అధికారపార్టీ అయినా అభ్యర్థి ఎవరో ఇంకా తేలక పోవడంతో శ్రేణులు కూడా ఇతరుల ప్రచారాలను గమనిస్తూ గమ్మున ఊరుకుంటున్నారు. ఇక్కడ నుంచి పలువురు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నా ప్రధాన పరిశీలనలో మాత్రం వెలిచాల రాజేందర్‌రావు, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, రుద్ర సంతోష్‌కుమార్, ఎస్‌ఆర్‌బలు సింగిరెడ్డి సుమనారెడ్డి, పొల్సాని స్నేహ పేర్లు ఉన్నాయి. వెలమ, రెడ్డి, బీసీ అభ్యర్థుల్లో ఎవరికి అవకాశం కల్పించాలనే దానిపై పార్టీ తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం. బీజేపీ బీసీకి, బీఆర్‌ఎస్ వెలమకు టికెట్ ఇస్తున్న నేపథ్యంలో రెడ్డి అభ్యర్థి అయితే బాగుంటుందని ఆ సామాజికవర్గం అభ్యర్థులైన ప్రవీణ్‌రెడ్డి, సుమనారెడ్డి పేర్లను ఆ వర్గీయులు సూచిస్తుండగా రాజకీయంగా బలమైన సామాజికవర్గం కావడంతో పాటు సుదీర్ఘ రాజకీయ అనుభవం సంబంధాలు ఉన్న కుటుంబ నేపథ్యం ఉన్న వెలిచాల రాజేందర్‌రావుకు టికెట్ ఇస్తే గట్టి పోటీ ఇవ్వవచ్చనే అభిప్రాయం కూడా బలంగా వ్యక్తమవుతుండడంతో ప్రధాన పరిశీలనలో ఆయన పేరు కూడా ఉన్నట్లు చెబుతున్నారు. బీసీ ఓటర్లు ఎక్కువగా ఉండడంతోపాటు బీసీల్లో రాజకీయ చైతన్యం పెరిగి గట్టిపోటీ ఇస్తుండడంతో బీసీ అభ్యర్థి అయిన రుద్ర సంతోష్ పేరు తెరపైకి వస్తున్నది. పార్టీ ఎన్నికల రాజకీయాల్లో క్రియాశీల పాత్ర నిర్వహిస్తూ రాజీవ్‌గాంధీ బృందంలోని సభ్యుడిగా అసెంబ్లీ ఎన్నికల్లో పలువురు అభ్యర్థుల గెలుపునకు మేధోపరంగా కృషిచేసిన సంతోష్‌కు టికెట్ ఇవ్వాలనే డిమాండ్ బలంగానే వస్తుండడంతో పార్టీ నాయకత్వం అభ్యర్థి విషయంలో తర్జనభర్జన పడుతున్నదని చెబుతున్నారు. ఎస్‌ఆర్‌బి, మహిళా అభ్యర్థులకు టికెట్ ఇవ్వాలన్న పక్షంలో సింగిరెడ్డి సుమనారెడ్డి, పొల్సాని స్నేహ పేర్లను పరిశీలించే అవకాశముందని చెబుతున్నారు. వీరిద్దరు కూడా జిల్లా రాజకీయాలను ప్రభావితం చేసే రెడ్డి, వెలమ సామాజికవర్గాలకు చెందిన వారు కావడంతో ఆ కులాలకు ప్రాధాన్యత ఇచ్చే విషయంలోనూ వీరి అభ్యర్థిత్వాలు కలిసి వస్తాయని భావిస్తున్నారు. అయితే అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేసినా త్వరలో ప్రకటించి ప్రచారానికి శ్రీకారం చుట్టకపోతే విపక్షాల అభ్యర్థులు లాభపడే అవకాశముందని వెంటనే అభ్యర్థిని ప్రకటించాలని కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు కోరుతున్నారు.



అసెంబ్లీలో అభివృద్ధిపై గళమెత్తిన నేతలు

- బీసీ కుల గణనకు బీఆర్‌ఎస్ మద్దతు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- నియోజకవర్గం అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి
- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 16: అసెంబ్లీ సమావేశాల్లో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి, ఇతర అంశాలపై గళమెత్తారు. నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశపెట్టిన కుల గణన బిల్లుకు ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించారు. బీసీ కులాల గణనకు బీఆర్‌ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతునిస్తుంది. కులగణన పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సూచించారు. అలాగే అసెంబ్లీలో కుల గణనపై తీర్మానం చేయడం సరిపోదని, చట్టం చేస్తే బాగుంటుందని అన్నారు. భవిష్యత్‌లో న్యాయపరమైన చిక్కులు రాకుండా కులగణన చట్టం ఉండాలని, ఎలాంటి కోర్టు కేసులకు అవకాశం ఉండకూడదని అన్నారు. కుల గణన పూర్తికాగానే వెంటనే చట్టం చేస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. కులగణన తర్వాత చట్టం ఎలాంటి పథకాలు అమలు చేస్తుందో ముందే చెప్పాలని కోరారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. ఎంబీసీలను మొదట గుర్తించినదే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. ఎంబీసీలకు మంత్రి పదవి ఇవ్వాలని సూచించారు. బీసీ సబ్‌ప్లాన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీహార్‌లో ఇప్పటికే కులగణన చేశారని, కానీ న్యాయపరమైన చిక్కులు వచ్చాయని ఆయన గుర్తుచేశారు.

కొండగట్టు ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు, తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఇష్ట దైవంగా కొలిచే కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయం, నల్లగొండ నరసింహస్వామి దేవాలయం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గత ఏడాది కొండగట్టు దేవస్థానాన్ని దర్శించినప్పుడు రూ. 100 కోట్లు ప్రకటించి, ఒక్క పైసా కేటాయించలేదని పేర్కొన్నారు. చొప్పదండి నియోజకవర్గం ప్రజల చిరకాల వాంఛ లెదర్ పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మిట్ట ప్రాంతమైన చొప్పదండి నియోజకవర్గంలో కాళేశ్వరం ప్రాజెక్టు, ఎల్లంపల్లి పైప్‌లైన్, ఎస్సారెస్పీ కెనాల్‌లోతో నియోజకవర్గ రైతులు తమ విలువైన భూములను కోల్పోయారని, వరద కాలువపై తూములు ఏర్పాటు చేసి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయాలని కోరారు. గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్ ఎడమ కుడి కాలువలకు సంబంధించిన 90 శాతం పనులు 2014లోనే పూరయ్యాయని, 10 ఏళ్లలో అధికారంలో ఉన్న గత ప్రభుత్వం 10 శాతం పనులు కూడా పూర్తి చేయలేదని, ఎడమ కుడి కాలువ పనుల పూర్తి చేసి సాగునీరు అందించాలని కోరారు. కొడిమ్యాల మండలం పోతారం చెరువు కట్ట ఎత్తును పెంచాలని కోరారు. తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయ వంటి మిడ్ మానేరు సమస్యల గురించి గతంలోని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విన్నారని, ప్రభుత్వం వెంటనే మిడ్‌మానేరు సమస్యలను పరిష్కరించాలని కోరారు. చొప్పదండి నియోజకవర్గానికి కేంద్రంగా ఉన్న గంగాధరలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. గత ఏడాది వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు చొప్పదండి నియోజకవర్గంలోని రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులు పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటిని మరమ్మత్తు చేయించాలని కోరారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.



- ఫిర్యాదులపై విచారణ జరిపిస్తాం..

పనులు కూడా కొనసాగిస్తాం

\- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

మానేరు రివర్ ఫ్రంట్‌పై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపిస్తాం. అలాగే అభివృద్ధిని కరీంనగర్ బిడ్డగా కాంక్షిస్తూ రివర్ ఫ్రంట్ పూర్తిచేసేందుకు నిధులు కేటాయించి సహకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

- మానేరు రివర్‌ఫ్రంట్‌కు నిధులు కేటాయించండి

కరీంనగర్ పట్టణాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2016-17లో అప్పటి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రపంచస్థాయి పర్యాటకులను ఆకర్షించే విధంగా మానేరు వాగుపై రూ. 450 కోట్లతో మానేరు రివర్ ఫ్రంట్ అనే గొప్ప ప్రాజెక్టును తీసుకువచ్చిందని అన్నారు. దానిలో భాగంగా దక్షిణ భారత దేశంలోనే మొట్టమొదటగా తీగల వంతెనను కూడా నిర్మించిందని అన్నారు. నీటి పారుదల, పర్యాటకశాఖల సమన్వయంతో టెండర్ ప్రక్రియ పూర్తిచేసుకొని 70శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు. మరో 30శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. మానేరు రివర్‌ఫ్రంట్‌ను అత్యాధునిక టెక్నాలజీతో పూర్తిచేసేందుకు గుజరాత్‌లోని సబర్మతి, సౌత్ కొరియా వంటి నగరాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని బృందం అధ్యయనం చేసి వచ్చిందని అన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పూర్తయితే కరీంనగర్ గొప్ప పర్యాటక కేంద్రంగా మారుతుందని, అందుకు అవసరమైన నిధులు ఇవ్వాలని గంగుల కమలాకర్ కోరారు.





సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

సమ్మె విజయవంతం

కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సమ్మె విజయవంతం అయింది. జిల్లాలోని 16 మండలాల్లో కార్మికులు ర్యాలీలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి, తహసీల్దారు కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో గీతా భవన్ చౌరస్తానుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కార్మిక హక్కులను కాపాడడం, వేతనాలు, సౌకర్యాలు కల్పించ డంలో పెట్టుబడిదారులకు ఆదర్శ యజమానిగా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సమ్మెను విచ్ఛిన్నం చేయ డానికి సర్వ అయుధాలను ఉపయోగించారని అన్నారు. నేషనల్ హెల్త్ మిషన్, ఐసీడీఎస్, ఉపాధి హామీ, మధ్యాహ్న భోజనం వంటి పథకాలకు బడ్జెట్‌లో నిధుల కేటా యింపులో కోత పెడుతున్నారన్నారు. ఈ సమ్మెకు జిల్లా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసు దేవరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్, టీడీపీ నాయకుడు కళ్యాడపు ఆగయ్య, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథ నాయకుడు జూపాక శ్రీనివాస్, సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి బామండ్ల రవీం దర్ మద్ద తు తెలిపారు. కార్యక్రమంలో వర్ణ వెంకట్‌రెడ్డి, జనగాం రాజమల్లు, గుడికందుల సత్యం, పున్నంరవి, ఆసోద రవీందర్, రాజమల్లయ్య, కప్పంపెల్లి రవి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

- సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై స్వామివారు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 16: జిల్లా కేంద్రంలోని మార్కెట్‌రోడ్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో జరుగు తున్న సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సూర్యరశ్మితో అగ్నిని పుట్టించి వైభవంగా అగ్నిప్రతిష్ఠ చేశారు. వివిధ హోమాలు, నిత్యపూర్ణాహుతి చేశారు. అనంతరం ధ్వజారోహణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. ఉదయం సూర్యప్రభ వాహనంపై, రాత్రి చంద్రప్రభ వాహనంపై శ్రీవారు ఉభయ దేవేరులతో కలసి ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ కనువిందు చేశారు. శ్రీవారిని భక్తులు దర్శించి పులకించిపోయారు. సాంస్కృతిక కళావేదికపై గాయకుడు, ఉత్సవాల కల్చరల్ ఆర్గనైజర్ సల్వాజి ప్రవీణ్ నేతృత్వంలో వివిధ భజనమండళ్ల పారాయణాలు, భజనలు, కీర్తనలతో ఆలయం మారుమోగింది. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పురాణం మహేశ్వరశర్మ ప్రవచనం చేశారు. జానపద సినీ నేపథ్య గాయ కుడు జడల రమేశ్ బృందం భక్తి సంగీత విభావరి అలరించింది. శుక్రవారంతో పాటు రథసప్తమి పర్వదినం కావటంతో ఆలయం భక్తులతో పోటెత్తింది. ఈ కార్యక్రమంలో అర్చకులు లక్ష్మీనారాయణాచార్యులు, నాగరాజాచార్యులు, వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో వుడుతల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ పురుమల్ల శ్రీనివాస్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పిసిసి రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు ఆకారపు భాస్కర్‌రెడ్డి భక్తులు పాల్గొన్నారు.



సూర్యప్రభ వాహనంపై పురవీధుల్లో విహరిస్తున్న స్వామివారు



నేటి కార్యక్రమాలు..

శనివారం ఉదయం 8 గంటల నుంచి నిత్యహోమం, కల్పవృక్షవాహనసేవ, పద్మశాలి సంఘం వారిచే సారె సమర్పణ, సాయంత్రం 6 గంటల నుంచి అశ్వ, గజ వాహన సేవలతో ప్రకాశంగంజ్ వరసిద్ధి వినాయకస్వామి దేవాలయం నుంచి ఎదుర్కోలు ఉత్సవం. సాంస్కృతిక వేదికపై ఉదయం, సాయంత్రం భజనలు, పారాయణాలు, సాంస్కృతిక కార్యక్రమాలు.

పది విద్యార్థుల అల్పాహారానికి రూ.8 లక్షల విరాళం

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్: పదో తరగతి విద్యార్థులకు అల్పాహారాన్ని అందించేందుకు జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్, జమ్మికుంట ఎస్‌ఆర్‌కే డెయిరీ రూ. 8 లక్షల విరాళం అందించినట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణతను సాధించే దిశగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించడంతోపాటు పాఠశాల అనంతరం అదనపు తరగతులను నిర్వహిస్తున్నారని చెప్పారు. సాయంత్రం వేళల్లో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు నర్సింగారావు, ప్రభాకర్‌రావు, ఆనందరెడ్డి, రాజమౌళి, గిరిధర్, కేశవరెడ్డి, ఎస్‌ఆర్‌కె డెయిరీ సభ్యులు పాల్గొన్నారు.

పీఎఫ్‌ఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేయాలి

- ఆదాయపన్ను రూ.10లక్షలకు పెంచాలి
- నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యోగుల నిరసన

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 16: పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్‌డీఏ) చట్టాన్ని రద్దు చేయాలని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆల్ ఇండియా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య, తెలంగాణ టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం పిలుపు మేరకు టీఎన్‌జీవో ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై, మధ్యాహ్న భోజన విరామ సమయంలో కలెక్టరేట్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడు తూ సీపీఎస్(కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) రద్దు చేయా లని, ఉద్యోగుల ఆదాయపరిమితిని రూ.10లక్షలకు పెంచాలని, ప్రైవేటైజేషన్ ఆలోచన విరమించు కోవాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు నాగుల నరసింహ స్వామి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మిందర్ సింగ్, రాజేశ్‌భరద్వాజ్, కిషన్, శారద, విజయలక్ష్మీ, హరిప్రియ, విజయలక్ష్మీ, గూడ ప్రభాకర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, పవన్‌కుమార్, నగేశ్, శంకర్, లింగయ్య, గంగారపు రమేశ్, రాజేశ్వర్‌రావు, నర్సయ్య, అభిషేక్, మన్మిత్ సింగ్, కొండయ్య, రామస్వామి, నరసింహారెడ్డి, కమలాకర్, కరుణాకర్, రాజశేఖర్‌రెడ్డి, ప్రణీత్, లలిత, మేరి, రమణ, లత, జలాలుద్దీన్‌అక్బర్, తిరుమల్‌రావు, నారాయణ సాత్విక్, రజనీకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, టీఎన్‌జీవో నాయకులు









ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలకు దరఖాస్తుల ఆహ్వానం

● లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 16: జిల్లా స్థాయి ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాసరచన, నినాదాలు, పోస్టర్ మూడు విభాగాల్లో పోటీలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. 'నేను రాత్రి పూట మిలినీయర్‌గా మారినట్లయితే, నేను ఆ డబ్బును ఎలా ఉపయోగించగలను' అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించడం జరుగుతుందని, 300 పదాలతో ఇంగ్లీష్, తెలుగు, హిందీ బాషల్లో రాయవచ్చని అన్నారు. 'సమ్మేళనం యొక్క పొదుపు, శక్తి' అనే అంశంపై నినాదాల పోటీని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆంగ్లం, తెలుగు, హిందీ భాషల్లో ఉంటుందని అన్నారు. పోస్టర్ పోటీ 'డిజిటల్, సైబర్ పరిశుభ్రత' అనే అంశంపై చేతితో డ్రా లేదా డిజిటల్‌గా కానీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ భాషల్లో వేయవచ్చని అన్నారు. పాల్గొనే వారి పేరు, పాఠశాల, కళాశాల పేరు, పబ్లిక్, ప్రైవేట్, పాల్గొనే వారి వయస్సు, కాంట్రాక్టు నెంబర్ పార్టిసిపెంట్/గార్డియన్‌ది పేరు దరఖాస్తుల్లో పాల్గొనాలని సూచించారు. జిల్లాస్థాయిలో నిర్వహించే ఈ మూడు పోటీల్లో విజేతలకు బహుమతి, సర్టిఫికెట్ ప్రదానం, రాష్ట్రస్థాయిలో బహుమతి, సర్టిఫికెట్‌తో పాటు సన్మానం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఈ నెల 22 సాయంత్రం 5 గంటలలోపు కేఎస్ఆర్ లీడ్‌బ్యాంక్ ఈమెయిల్‌కు వ్యాసం, నినాదం, పోస్టర్‌లను పంపించాలని సూచించారు.

హైకోర్టు ఎదుట హాజరైన కరీంనగర్ టూటౌన్ ఎస్‌హెచ్‌వో

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఓ బాధితురాలు ఫిర్యాదు చేసినా ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేసిన వ్యవహారంలో కరీంనగర్ టూటౌన్ ఎస్‌హెచ్‌వో హైకోర్టు ఎదుట హాజరయ్యారు. కరీంనగర్‌లో ఓ జడ్జి కొడుకుపై ఉద్యోగం కోల్పోయిన ఆఫీస్ సబార్డినేట్ ఆరోపణలకు సంబంధించి నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను హైకోర్టుకు అందజేశారు. తాము ఆదేశించినా ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకపోవడంపై సదరు ఎస్‌హెచ్‌వోపై రెండురోజుల కింద హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు ఆదేశాల మేరకు ఎస్‌హెచ్‌వో శుక్రవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఫిర్యాదుదారు (పిటిషనర్) ప్రవర్తన సైతం బాగాలేకపోవచ్చు. ఉద్యోగం పోయిన తర్వాతే ఆమె ఫిర్యాదు చేసి ఉండొచ్చు. కానీ ఆ అంశాల మెరిట్స్‌పై మేం ఎలాంటి వ్యాఖ్య చేయడం లేదు. అవన్నీ దర్యాప్తులో తేలాలి. కానీ నమోదు చేయదగ్గ నేరానికి (కాగ్నిజబుల్ అఫెన్స్) సంబంధించి పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకపోవడం తీవ్రమైన అంశం. ఒక మహిళ పోలీస్‌స్టేషన్‌కు ఎందుకు వస్తుంది. అది టూరిస్టు కేంద్రం లేదా సినిమా థియేటర్ కాదు కదా? ఉదయం 11 గంటల నుంచి 4 గంటల వరకు వేచి ఉంచి ఫిర్యాదు ఇవ్వలేదని చెప్పడం సరికాదు. పౌరులు ఎలాంటి భయం లేకుండా పోలీస్‌స్టేషన్ వచ్చేలా వర్క్‌షాప్ పెట్టేలా డీజీపీకి సూచించండి' అని ధర్మాసనం పేర్కొంది. ఫిర్యాదు చేసినప్పుడు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయక పోవడానికి కారణాలను వివరిస్తూ లిఖితపూర్వక వివరణ సమర్పించాలని సదరు పోలీసు అధికారికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. విచారణను రెండువారాలకు వాయిదా వేసింది.

తండ్రిని హతమార్చిన తనయుడు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 16: పెద్దపల్లి మండలంలోని హన్మంతునిపేట్ గ్రామానికి చెందిన యాదగిరి ఓదెలు (55)ను అతని కుమారుడు రాజు కత్తితో పొడిచి హత్య చేసాడు. సంఘటనపై సమాచారం అందుకున్న పెద్దపల్లి ఏసీపీ ఎ.కృష్ణ, పెద్దపల్లి సీఐ కృష్ణ, పెద్దపల్లి ఎస్‌ఐలు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.


పాఠశాల విద్యార్థులకు 'స్నేహిత' అవగాహన కార్యక్రమం

తిమ్మాపూర్, ఫిబ్రవరి16: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల కేంద్రీయ విద్యాలయ, స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, మండలంలోని రామకృష్ణ కాలనీలో గల గన్నేరువరం మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాల విద్యార్థులకు స్నేహిత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రూరల్ సీడీపీఓ సబితా ముఖ్య అతిథిగా హాజరై అవగాహన కల్పించారు. న్యూట్రిషన్ ఫుడ్, బాల్య వివాహాలు, బాల బాలికలు యుక్త వయస్సులో మార్పుల వలన తెలిసి తెలియక తప్పుతోవ పడుతున్నారని అన్నారు. మంచి లక్ష్యం ఏర్పాటు చేసు కొని విద్యార్థులు ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థులకు ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన ఉండాలని, స్మార్ట్ ఫోన్, ఇంటర్నెట్ వినియోగంలో పిల్లలు జాగ్రత్తగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో అపరిచితులతో స్నేహం చేయవద్దని సూచించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు గురి కాకుండా మంచి మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కో అర్డినేటర్ సంపత్, ఏసిడిపివో అరవింద, ప్రిన్సిపాల్స్ వామన్ రావు, మధుసూధన్, సూపర్‌వైజర్లు శ్రీలత, పద్మ, పంచాయతీ కార్యదర్శి మహేందర్, సోషల్ వర్కర్ రమేష్, ఏఎన్ఎం రోజా, షీ టీం విజయమణి ఉన్నారు.


సమ్మక్క జాతరకు ఆర్టీసీ ఆర్ఎం గేట్‌మీటింగ్

భగత్‌నగర్, ఫిబ్రవరి 16: ఈ నెల 18 నుంచి జరిగే సమ్మక్క సారలమ్మ జాతరను పురస్కరించుకుని శుక్రవారం ఆర్టీసీ కరీంనగర్‌రీజినల్ మేనేజర్ ఎస్ సుచరిత గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ కుంభమేళాగా అభివర్ణించే మేడారం జాతరను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేని ప్రయాణ అనుభూతిని కల్పించి వారి మన్ననలు పొందాలన్నారు. జాతర సందర్భంగా డ్రైవర్లు బస్సులను ఓవర్‌టేక్ చేయకుండా క్రమ పద్ధతిలో వాహనాలను నడపాలన్నారు. ఎలాంటి ప్రమాదాలకు అవకాశంలేకుండా ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్‌లు ఎస్ భూపతిరెడ్డి, కె సత్యనారాయణ, కరీంనగర్-1, 2 డిపో మేనేజర్లు ఎల్ మల్లేశం, విమలయ్య, సూపర్‌వైజర్లు నజీర్, వీరస్వామి, విజయలక్ష్మి, తిరుపతి పాల్గొన్నారు.


ఆర్టీసీలో గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న ఆర్ఎం సుచరిత









భక్తులతో కిక్కిరిసిన రాజన్న క్షేత్రం



భక్తులతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం

వేములవాడ, ఫిబ్రవరి 16 : దక్షిణ కాశీ వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం అశేష భక్తజనంతో కిక్కిరిసి పోయింది. మేడారం సమ్మక్క, సారక్క జాతర నేపథ్యంలో రాజరాజేశ్వరస్వామివారికి తొలి మొక్కులు చెల్లించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం వేలాది మంది భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించిన భక్తులు ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని స్వామి వారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. శుక్రవారం సందర్భంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి మహా మండపంలో రుద్రాభిషేకం అన్న పూజ తదితర ఆర్జిత సేవలను రద్దు చేశారు. దీంతో క్యూ లైన్‌లు వేగంగా కదిలి భక్తులకు స్వామివారి దర్శనం కలిగే అవకాశం లభించింది. అనుబంధ ఆలయ మైన బద్ది పోచమ్మ ఆలయం లోనూ భక్తుల రద్దీ కొనసాగింది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనం సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.



స్వామివారిని దర్శించుకున్న భక్తులు

యమధర్మరాజు ఆలయంలో అభిషేకం





స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, ఫిబ్రవరి 16:ధర్మపురిలోని యమ ధర్మరాజు ఆలయంలో శుక్రవారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేద పండితులుబొజ్జ రమేష్ శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నేరెళ్ల సంతోష్‌కుమార్, ఒద్దిపర్తి కళ్యాణ్ స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్యసూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అప మృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాల్లో కూడ స్వామి వారలను భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్‌గా సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్



సిరిసిల్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వంలో రాజన్న సిరిసిల్ల జిల్లాను రాష్ట్ర స్థాయి పదవి వరించింది. ఇప్పటికే వక్ఫ్ బోర్డు డైరెక్టర్లను నియమించగా శుక్రవారం హైదరాబాద్‌లో జిల్లాలోని గంభీరావుపేటకు చెందిన సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్‌ను వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్‌గా ఎన్ను కున్నారు. అజ్మతుల్లా హుస్సేన్ 23 ఏళ్లుగా కాంగ్రెస్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయి పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ కన్వీనర్‌గా పని చేస్తున్నారు. యూత్ కాంగ్రెస్ కాంగ్రెస్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అధికార ప్రతినిధిగా పనిచేశారు. జాతీయ కాంగ్రెస్‌లో ప్రధాన కార్యదర్శిగా, కార్యదర్శిగా, కో ఆర్డినేటర్‌గా, ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.దీంతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ వివిధ బాధ్యతల్లో పనిచేసిన అనుభవం ఉంది. వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా అజ్మ తుల్లా నియామకంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ కార్గో ద్వారా మేడారం సమ్మక్క ప్రసాదం

భగత్‌నగర్, ఫిబ్రవరి 16: మేడారం వెళ్లి సమ్మక్క సారలమ్మలను దర్శించుకోలేని వారి కోసం ఆర్టీసీ ప్రసాదాన్ని ఇంటి వద్దకే అందించనున్నట్లు ఆర్టీసీ కార్గో ఏటీఎం ఎన్ సదాశివ్ ఒక ప్రకటనలో తెలిపారు. మేడారం వెళ్లలేని భక్తులు 299 రూపాయలు చెల్లించి ప్రసాదం కోసం బుక్ చేసుకోవాలన్నారు. ఈ నెల 25వ తేదీ తర్వాత వారికి ఇంటి వద్దకే అమ్మవారి ప్రసాదం అందించడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ కల్పించిన ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

ఆసుపత్రిపై దాడి : కేసు నమోదు

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 16: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి, వైద్యుడిపై దాడిన చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి శుక్రవారం తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన అబ్బూరి చిన్న మల్లయ్య మూడు రోజుల క్రితం మృతి చెందాడు. ఆయన మృతికి వైద్యుడి నిర్లక్ష్యమే కారణమంటూ మృతుడి బంధువులు ఆసుపత్రిలోని ఫర్నీచర్ ధ్వంసం చేసి వైద్యుడిపై దాడి చేశారు. ఆసుపత్రి యాజమాన్యం, వైద్యుడి ఫిర్యాదు మేరకు అబ్బూరి మహేష్‌గౌడ్, అశోక్‌గౌడ్, రాకేష్‌గౌడ్, అల్వాల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దాడి ఘటనకు నిరసనగా పట్టణంలోని ఐఎమ్ఏ ఆధ్వర్యంలో ప్రైవేటు ఆసుపత్రులు బంద్ పాటించాయి.

నకిలీ ధ్రువపత్రాల కేసులో పోలీసు కస్టడీకి నిందితులు



సోదాలకు వెళుతున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 16: వివా దంలో ఉన్న భూమికి నకిలీ ధ్రువ పత్రాలు సృష్టించి విక్రయం పేరిట కోటి 37 లక్షలు వసూలు చేసిన కేసులో అరెస్టు అయి జైలులో రిమాండ్‌లో ఉన్న ముగ్గురు నిందితులను కొత్తపల్లి పోలీసులు శుక్రవారం కస్టడీకి తీసుకున్నారు. కరీంనగర్ శివారులోని రేకుర్తిలో వివాదంలో ఉన్న భూమిని నకిలీ పత్రాలతో వేములవాడకు చెందిన గునుకుల రాజిరెడ్డి అనే వ్యక్తికి విక్రయించి అతని వద్ద కోటి 37 లక్షలు కాజేసినట్లు బాధితుడు ఫిర్యాదుతో ఈ నెల 9న 17వ డివిజన్ కార్పొరేటర్ భర్త కోల ప్రశాంత్, 18వ డివిజన్ కార్పొరేటర్ భర్త సుధగోని కృష్ణగౌడ్, మరో వ్యక్తి ఏలేటి భరత్ రెడ్డిలపై కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

అప్పటి నుంచి జైలులో ఉన్న ముగ్గురు నిందితుల నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు పోలీ సులు కస్టడీ పిటిషన్ వేయగా కోర్టు అనుమతిం చింది. ఈ మేరకు ఒక రోజు కస్టడీకి తీసుకున్నారు. అనంతరం కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిందితులు ముగ్గురి ఇళ్లలో సోదాలు నిర్వహించి పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ముగిసిన జంగిలి సాగర్ పోలీసు కస్టడీ

మరో వైపున భూకబ్జా, బెదిరిం పులకు సంబంధించిన కేసులో అరెస్టు అయి జైలులో ఉన్న కార్పొరేటర్ జంగిలి సాగర్‌ను మరోమారు కొత్తపల్లి పోలీసులు గురువారం కస్టడీకి తీసుకుని విచారణ అనంతరం శుక్రవారం మళ్లీ జైలుకు తరలించారు.

రాజన్న సేవలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్



కోడె మొక్కు చెల్లించుకుంటున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్

వేములవాడ, ఫిబ్రవరి 16: వేములవాడ రాజరాజేశ్వర స్వామిని రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వ చనం, ఆలయ సూపరింటెండెంట్ బి.తిరుపతిరావు, ప్రొటోకాల్ విభాగం సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాము లు ప్రసాదం అందజేశారు. అంతకుముందు రాజరాజేశ్వర స్వామివారి దర్శనం కోసం వేములవాడకు వచ్చిన శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్‌ను స్థానిక బీఆర్ఎస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, యువజన విభా గం నాయకుడు వెంగళ శ్రీకాంత్ గౌడ్, యామ తిరుపతి, పోతు అనిల్, విజయ్ యాదవ్, శ్రీధర్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు.

సింగాపూర్‌లో దొంగల హల్‌చల్

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 16: మండలంలోని సింగాపూర్‌లో తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగలు శుక్రవారం చోరీలకు పాల్పడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రమీల అనే మహిళ ఇంట్లోకి దొంగలు చొరబడి రూ.95 వేలు విలువ చేసే బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. అలాగే వేణుగోపాల్‌రెడ్డి అనే వ్యక్తి ఇంటి తాళాలను పగలగొట్టి విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారు. దొంగతనం దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయిననట్లు గ్రామస్థులు తెలిపారు. దొంగతనంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌లో

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో రెండిళ్లలో చోరీ జరిగింది. లక్ష్మీపూర్ కాలనీకి చెందిన పసుల నర్సయ్య ఇంటి తాళం పగల గొట్టి బీరువాలో ఉన్న అర తులం బంగారంతోపాటు 20 తులాల వెండి ఆభరణాలు, రూ. 9 వేలు నగదు ఎత్తుకెళ్లారు. అదే విధంగా అట్టెల నర్సయ్య ఇంటి తాళం పగలగొట్టిన దొంగలు రూ.3 వేల నగదును దొంగతనం చేశారు. పక్కనే పసుల మల్లేశం ఇంటి తాళం పగలగొట్టి చోరీకి యత్నించారు. విషయం తెలుసుకున్న సీఐ సదన్‌కుమార్ చోరీకి గురైన ఇళ్లను పరిశీలించారు. దొంగల ఆచూకీ కోసం క్లూస్ ఆధారాలు సేకరించింది.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 16: జమ్మికుంట మండలం రంగమ్మపల్లి గ్రామానికి చెందిన బాలసాని శ్రీనివాస్ ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. వృత్తిలో భాగంగా పెద్దంపల్లిలో తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. గమనించిన తోటి గీత కార్మికులు మెరుగైన చికిత్స నిమిత్తం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వం స్పందించి గీత కార్మికుడిని ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

దాడి కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 16: కోనరావుపేట మండలంలోని వట్టిమల్ల గ్రామంలో దాడి కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఎస్సై అంజనేయులు వివరాల ప్రకారం... 27 జూలై 2017న వట్టిమల్ల గ్రామానికి చెందిన బండ రాజు, కుమ్మరి మల్లయ్య కలిసి వైన్ షాప్‌లో మద్యం కొనుగోలు చేశారు. ఆ సమయంలో కోనరావుపేటకు చెందిన బాబు అకారణంగా బండ రాజుపై బాటిల్, రాళ్లతో దాడి చేశాడు. ఈ దాడిలో తప్పించుకునేందుకు ప్రయత్నించిన రాజు ప్రహరీ పైనుంచి దూకగా కుడికాలు విరిగిపోయింది. ఈ సంఘటనపై అప్పటి ఎస్సై రమేశ్‌నాయక్ కేసు నమోదు చేశారు. సాక్షులను విచారించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున పీపీ సందీప్ వాదించగా కోర్టు కానిస్టేబుల్ మోహన్ సాక్షులను ప్రవేశపెట్టారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ నిందితుడు బాబుపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధించారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి శిక్ష

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 16: జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన పైండ్ల అంజయ్యకు విద్యుత్ చౌర్యం కేసులో జైలు శిక్ష, జరిమానా విధించారు. అంజయ్య విద్యుత్ చౌర్యం చేస్తూ ట్రాన్స్‌కో అధికారులకు పట్టుబడిన కేసులో జగిత్యాల జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి 10,896 రూపాయల జరిమానా లేదా 4 నెలల జైలుశిక్ష విధించినట్లు ట్రాన్స్‌కో విజిలెన్స్ ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

కరెంట్ మోటార్ల దొంగల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 16: జిల్లాలో వ్యవసాయ బావుల వద్ద కరెంట్ మోటార్ల దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల అంతర్ జిల్లా దొంగలను ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వివరాలు వెల్లడించారు. చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన అజ్గర్ పాషా చెడు వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. తనకు పరిచయమైన వరంగల్ జిల్లా కొత్తగూడ మండలం వెలుబల్లికి చెందిన బాసవేణి నాగరాజు, వేములవాడకు చెందిన నీలం మౌనిష్, దండు శ్రీకాంత్‌తో కలిసి జిల్లాలోని వివిధ గ్రామాలలో వ్యవసాయ బావుల వద్ద ఉన్నటువంటి మోటా ర్లను దొంగిలించారు. ఆ మోటార్లను సోహెల్ అనే వ్యక్తికి విక్రయించారు.

వచ్చిన డబ్బుతో జల్సాల చేసుకు న్నారు. దొంగతనం చేసిన మోటార్లను సోహెల్‌కు ఇచ్చి రావడానికి కార్లు అద్దెకు తీసుకొని వెళ్లే వారు. దొంగతనం చేసిన కరెంటు మోటార్లను శుక్రవారం కారులో కామారెడ్డికి వెళ్లి అమ్మాలనుకున్నారు. మర్రిపల్లి గ్రామ శివారువద్ద రూరల్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. దొంగలించిన 4,78,000 రూపాయల విలువైన 33 కరెంటు మోటార్లు, దొంగతనాలకు ఉపయో గించిన 5 కార్లను, 2 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకిన వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న కామా రెడ్డికి చెందిన సోహెల్‌ను త్వరలోనే పట్టుకుంటామన్నారు. వేముల వాడ డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, ఎస్సై మారుతి ఉన్నారు.

కాళేశ్వరం జలాలతో అన్నపూర్ణ రిజర్వాయర్ నింపాలి



పెద్దలింగాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 16: మండలంలోని అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌ను కాళేశ్వరం జలాలతో నింపాలని రైతులు డిమాండ్ చేశారు. అన్నపూర్ణ రిజర్వాయర్ దిగువన వ్యవసాయ భూములు ఉన్న పెద్దలింగాపూర్, అనంతగిరి గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం పెద్దలింగాపూర్ సమీపంలో రాస్తారోకో చేపట్టారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నపూర్ణ రిజర్వాయర్‌లో నీరు ఉంటుందని భావించి పంటలు వేశామన్నారు. రిజర్వాయర్ నీరు డెడ్ స్టోరేజీకి చేరడంతో ఇప్పటికే పంటలు ఎండిపోయాయన్నారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోదా? అని ప్రశ్నిం చారు. రిజర్వాయర్‌లో నీరు ఉంటే భూగర్భ జలాలు పెరగడంతో పాటు సీపేజీ నీటితో ఏటా పంటలు పండుతున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి మధ్యమానేరు నుంచి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విషయం తెలుసుకున్న పోలీసులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని నచ్చజెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతులు అమ్ముల అశోక్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, మల్లవ్వ, పోచవ్వ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ కార్మికుడి మృతి

కోల్‌సిటీ, ఫిబ్రవరి 16: గోదావరిఖని గంగానగర్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి రెడ్డిపాక మొండయ్య మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్ఐ సమ్మయ్య తెలిపారు. ఉదయ్‌నగర్‌లో గురువారం సాయంత్రం పెరుగు కొనుగోలు చేసుకుని రాజీవ్ రహదారి దాటుతుండగా మంచిర్యాల నుంచి గోదావరిఖనికి ద్విచక్ర వాహనంపై వస్తున్న మార్కండేయకాలనీకి చెందిన మురళీధర్ అనే వ్యక్తి మొండయ్యను ఢీకొట్టడంతో అతని డివైడర్‌పై పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి అల్లుడు చంద్రగిరి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 16: మోతాదుకు మించి అధికంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీలలో పట్టుబడిన ముగ్గురు వాహన దారులకు జైలుశిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. ఇటీవల పట్టుబడిన 12 మంది వాహనదారులను శుక్రవారం కరీంనగర్ ము న్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఒకరికి 10 రోజులు, మరొకరికి ఐదు రో జులు, ఇంకొకరికి మూడు రోజుల వంతున జైలుశిక్ష లేదా మొత్తం రూ. 7,500 ల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని తెలిపారు. మిగతా 9 మంది వాహనదారులకు రూ. 14వేలు జరిమానా విధించారని తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోల్‌సిటీ, ఫిబ్రవరి 16: గోదావరిఖని తిలక్‌నగర్‌లోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం గోదావరిఖని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. మోహన్ గుప్తా చుట్టు పక్కల వారి వద్ద నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి తిలక్‌నగర్‌లోని ఓ ఇంట్లో నిల్వ చేయగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

కేబుల్‌బ్రిడ్జి ఐలాండ్ వద్ద సిమెంట్ లారీ బోల్తా



బోల్తాపడ్డ సిమెంట్ లారీ


కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 16: కరీంనగర్ శివారులోని రాజీవ్ రహదారిపై కేబుల్‌బ్రిడ్జి ఐలాండ్ వద్ద గురువారం అర్ధరాత్రి సిమెంట్ లారీ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడింది. గోదావరిఖని వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళుతున్న సిమెంట్ ట్యాంకర్ ఐలాండ్ వద్ద టర్న్ చేసే సమయంలో అదుపుతప్పి బోల్తాపడగా డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయని పోలీసులు తెలి పారు. ఐలాండ్ వద్ద రోడ్డుపై భారీ ట్యాంకర్ బోల్తా పడటంతో రాజీవ్ రహదారిపై గోదావరి ఖని నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్లే వాహనాలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. రాత్రి నుంచి పలుమార్లు వాహనాలు భారీ సంఖ్యలో నిలిచి పోగా పోలీసులు సాయంత్రం ట్యాంకర్‌ను తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు.

నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 16: జాతీయ యువజన పార్లమెంటు ఉత్సవాల్లో భాగంగా జాతీయస్థాయి ఉపన్యాస పోటీలను నిర్వహి స్తున్నట్టు తెలిపారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి ఎం వెంకటరాంబాబు తెలిపారు. ఈ పోటీలను కొన్ని జిల్లాల వారిగా విభజించి ఆన్‌లైన్ ద్వారా ఈ పోటీలను నిర్వహి స్తోంది. ఈ పోటీల్లో విజేతలు రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయిలో గెలిచిన వారు జాతీయస్థాయి పోటీలకి ఎంపిక అవుతారు.జాతీయ స్థాయిలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రెండు లక్షల నగదు, రెండో బహుమతి లక్ష యభైవేయిలు, మూడో బహుమతి లక్ష రూపాయలు, ప్రోత్సాహక బహుమతులు ఇద్దరికీ 50 వేల చొప్పున ఇవ్వబడతా యని తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ 2024 నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలని, మై యువ భారత్ అనే కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మాత్రమే అర్హులని తెలిపారు.

ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నల్గొండ జిల్లాల అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఈ పోటీలను నిర్వహించడం జరుగుతుం దని తెలిపారు. అభ్యర్థులు 19వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు www.mybharat.gov.in వెబ్‌సైట్ ద్వారా అనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ పోటీలు 20వ తేదీ ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా యువజన అధికారి, నెహ్రూ యువ కేంద్రం, కరీంనగర్ ఆఫీసు సమయాల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

గుండెపోటుతో సీసీఆర్‌బీ ఎస్ఐ మృతి



ఎస్ఐ లింగారెడ్డి (ఫైల్)

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 16: సైదాపూర్ మండలం రాయికల్ గ్రామానికి చెందిన లింగారెడ్డి అనే ఎస్ఐ శుక్రవారం కరీంనగర్ తిరుమల్‌నగర్‌లో తన ఇంటిలో గుండెపోటుతో మరణించాడు. ఆయనకు భార్య, కొడుకు, కూతురులు ఉన్నారు. లింగారెడ్డి కుటుంబ సభ్యులను అడిషనల్ డీసీపీ సి రాజు పరామర్శించారు. ఎస్ఐ లింగారెడ్డి కామారెడ్డి నుంచి బదిలీపై కరీంనగర్ సీసీఆర్‌బీ ఎస్ఐగా వచ్చారు. గురువారమే ఆయన విధులకు రిపోర్ట్ చేశారు. లింగారెడ్డి అంత్యక్రియలకు ఆర్థిక సహాయాన్ని అందించారు. కుటుంబసభ్యులు ధైర్యంగా ఉండాలని, పోలీసుశాఖ వారికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీతో పాటు సీసీఆర్‌బీ ఏసీపీ జి విజయ్‌కుమార్, హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాసులు, హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్‌కుమార్, పోలీస్ వెల్ఫేర్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, సైదాపూర్ ఎస్ఐ ఆరోగ్యం, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్య జీవితంలో క్రీడలను భాగం చేసుకోవాలి
- డీఈవో సీహెచ్ జనార్దన్‌రావు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 16: నిత్య జీవితంలో ప్రతీ ఒక్కరు క్రీడలను భాగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ జనార్దన్‌రావు అన్నారు. కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల్లో శుక్రవారం ఖేలో మానేర్ పేరిట నిర్వహించిన క్రీడాపోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. మానేరు పాఠశాల విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ చేయగా ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ క్రీడల్లో ప్రతి ఒక్క విద్యార్థి పాల్గొనాలన్నారు. మానేరు విద్యాసంస్థలు క్రీడలకు ప్రాధాన్యమివ్వడం అభినందనీయమన్నారు. మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మానేరు విద్యాసంస్థల విద్యార్థులు సుమారు100 మంది జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటుతున్నారన్నారు. డీఈవో వాలీబాల్ సర్వీస్ చేసి మ్యాచ్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేశ్‌రెడ్డి, డీసీఈబీ కార్యదర్శి మారం స్వదేశ్ కుమా ర్, ప్రిన్సిపల్‌లు రాజు చాకో, సరితారెడ్డి, పీఈటీలు సిలివేరి మహేందర్, తిరుపతి, మహేందర్ నాయక్, జహేద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దీప్‌దాస్‌మున్షీని కలిసిన ఎన్‌ఆర్‌ఐ సుమనరెడ్డి

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 16: కరీంనగర్ ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఎన్‌ఆర్‌ఐ సింగిరెడ్డి సుమనరెడ్డి శుక్రవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో కాంగ్రెస్‌పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి దీప్‌దాస్‌మున్షీని కలిశారు. సమనరెడ్డి తన తండ్రి సింగిరెడ్డి భాస్కర్‌రెడ్డితో కలిసి దీప్‌దాస్‌మున్షీని కలిసి తన పార్లమెంట్ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని వినతిపత్రం సమర్పించారు. కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి బీఆర్‌ఎస్ నుంచి వెలమ, బీజేపీ నుంచి బీసీ అభ్యర్థులు ఉండగా రెడ్డి వర్గం నుంచి మహిళా అభ్యర్థిగా తన పేరును పరిశీలించాలని కోరుతూ తను సర్వే చేయించిన రిపోర్ట్‌ను సమర్పించినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన నగేష్ ముదిరాజ్

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 16 : బీజేపీ నాయకుడు మంద నగేష్ ముదిరాజ్ శుక్రవారం కాంగ్రెస్‌పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో మంద నగేష్ ముదిరాజ్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌పార్టీలో చేరారు. తెలంగాణ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి దీప్‌దాస్‌మున్షీ నగేష్ ముదిరాజ్ మెడలో కాంగ్రెస్‌పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నగేష్ ముదిరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌లో చేరడం సంతోషకరంగా ఉందన్నారు.

జంక్షన్ల అశాస్త్రీయ నిర్మాణాలతో ప్రజల ప్రాణాలు బలి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేశ్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 16: స్మార్ట్‌సిటీ నిధులను మున్సిపల్ అధికారులు, పాలకవర్గం ఇష్టారాజ్యంగా ఖర్చుచేసి అశాస్త్రీయంగా జంక్షన్లను నిర్మించి ప్రజల ప్రాణాలను బలిగొంటున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. నగరంలోని చౌరస్తాల సుందరీకరణ పేరుతో స్మార్ట్‌సిటీ నిధులను ఖర్చుచేసి కమీషన్లతో జేబులు నింపుకున్నారే తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమి లేదని మండిపడ్డారు. నగరంలోని మారుతీనగర్ పడవ చౌరస్తా, కేబుల్ బ్రిడ్జి బైపాస్ రోడ్డు చౌరస్తా అశాస్త్రీయంగా ప్రణాళిక లేకుండా నిర్మాణాలు చేసి జేబులు నింపుకున్నారని విమర్శించారు. ప్రజా రవాణాపై ఆలోచన లేకుండా నిర్మించడంతో ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని, దీనికి బీఆర్‌ఎస్ నాయకులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అశాస్త్రీయంగా నిర్మించిన జంక్షన్ల సుందీరకరణ పనుల్లో కమీషన్లను దండుకున్న బీఆర్‌ఎస్ పాలకులు, అధికారులు, కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు రికవరీ చేయాలని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

షీటీం ఆధ్వర్యంలో స్నేహిత కార్యక్రమం



అవగాహన కల్పిస్తున్న షీటీం ఇన్‌చార్జి, మహిళా ఠాణా సీఐ శ్రీలత

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 16 : కరీంనగర్ షీటీం ఆధ్వర్యంలో స్నేహిత కార్యక్రమం శుక్రవారం జరిగింది. షీటీం ఇంచార్జి, మహిళా ఠాణా సీఐ శ్రీలత ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో విద్యార్థులకు సీఐ శ్రీలత అవగాహన కల్పించారు. విద్యార్థులు ఇంటర్‌నెట్ వినియోగం, చాటింగ్, ఇతర సామాజికమాధ్యమాల్లో వ్యవహరించేతీరుపై పలు సూచనలు, జాగ్రత్తలు తెలిపారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల అధినేత ప్రసాదరావు, సమీకృత శిశు అభివృద్ధి సేవ సూపర్‌వైజర్ అరుణ, ప్రసూన, వినోదరావు, ప్రసాద్, రితేష్మఎహతా గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

మానకొండూర్, ఫిబ్రవరి 16 : కేంద్రంలోని మోదీ ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి పిలుపునిచ్చారు. మానకొండూర్‌లోని తహశీల్దార్ కార్యాలయం ముందు బీజేపీ కార్మిక, కర్షక విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతాంగ, కార్మికవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం అయిందన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో 4లేబర్ కోడ్లను ప్రవేశపెట్టి కార్మికుల హక్కుల కాలరాసిందన్నారు. కార్మికుల హక్కులను కాపాడుకునేంత వరకు కార్మికులందరూ సంఘటితమై ఉద్యమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రయ్య, సతీష్, లక్ష్మన్, మల్లారెడ్డి, నర్సయ్య, వెంకటేశ్, లక్ష్మీ, రోజా, తిరుమల, రాజమణి, అరుణ ఉన్నారు.

జాతరలో సకల సదుపాయాలు కల్పించాలి

శంకరపట్నం, ఫిబ్రవరి 16: శ్రీసమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు సకల సదుపాయాలు కల్పించాలని జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఈవో మారుతిరావుతో కలిసి ఆయన కేశవపట్నంలో నిర్వహించే శ్రీసమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీసమ్మక్క-సారలమ్మ దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా పూర్తి ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

పంట క్షేత్రాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

చొప్పదండి, ఫిబ్రవరి 16: మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో వరి, మొక్కజొన్న పంట క్షేత్రాలను శుక్రవారం శాస్త్రవేత్తలు పరిశీలించారు. వరి, మొక్కజొన్నకు చీడపీడ నివారణ, కత్తెరపురుగు నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరి అగ్గితెగులు ఆశించే అవకాశమున్నందున క్రిమిసంహారక మందులు పిచికారు చేయాలని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం శ్రాస్త వేత్త విజయభాస్కర్, వంశీకృష్ణ, ఏఈవో ప్రసన్నకుమార్, రైతులు పాల్గొన్నారు.

సిమెంట్ రంగంలో అధునాతన మార్పులు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 16: సిమెంట్ రంగ పరిశ్రమలో రోజురోజుకీ అధునతన మార్పులు వస్తున్నాయని ఆదిత్య బిర్లా సిమెంట్ కంపెనీ తెలంగాణ రీజనల్ హెడ్ టెక్నికల్ సర్వీసెస్ శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు 'ఇన్నోవేటివ్ కాంక్రిట్ ఇన్ దా ఫ్యూచర్ ఆఫ్ బిల్డింగ్ మెటీరియల్స్' అనే సాంకేతిక సెమినార్ డైరెక్టర్ డాక్టర్ కె. శంకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద పెద్ద భవనాలకు, రోడ్డులలో నిర్మాణాలను అధునాతన పద్ధతులు ఉపయోగించడం వలన ఏదైనా క్రాక్స్ ఏర్పడినప్పుడు వాటంతట అవే రిపేర్ చేసుకునే విధంగా సెల్ఫ్ హీలింగ్ కాంక్రిట్‌ను తయారు చేస్తున్నారన్నారు. అనంతరం కాంక్రీట్ టెక్నాలజీ అనే సబ్జెక్టులో యూనివర్సిటీ పరీక్షలో మార్కులు సాధించిన సోనియా అనే విద్యార్థికి సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు

చొప్పదండి, ఫిబ్రవరి 16: పదవ తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్షలను నిర్వహించినట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కాంపల్లి అరవింద్ అన్నారు. చొప్పదండిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ప్రతిభా పరీక్షకు సంబంధించిన ప్రశ్నావళిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థుల కోసం పోరాటం చేయడమే కాకుండా వారిలోని సృజనాత్మకతను వెలికితీసే విధంగా ప్రతిభా పరీక్షను నిర్వహిస్తున్నట్లు, పరీక్షలను విజయవంతం చేసిన విద్యార్థులకు, పాఠశాల యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ సహ కార్యదర్శి ఆసంపల్లి వినయ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు
- మేయర్ యాదగిరి సునీల్‌రావు



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 16: వేసవిలో నగర ప్రజలకు మంచినీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసి ఆ మేరకు చర్యలు చేపడుతామని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. శుక్రవారం నగరంలోని 38వ డివిజన్‌లోని విద్యానగర్‌లో కార్పొరేటర్ కచ్చు రవితో కలిసి నగర పాలక సంస్థ జనరల్ ఫండ్ 29 లక్షల రూపాయలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలకు ఇబ్బందులు రాకుండా ప్రతిరోజు మంచినీటిని సరఫరా చేస్తున్నది కేవలం కరీంనగర్‌లోనేనని అన్నారు. వచ్చే వేసవిలో కూడా ఎలాంటి సమస్యలు రాకుండా మంచినీటిని సరఫరా చేస్తామని తెలిపారు. విద్యానగర్ బీరప్పనగర్ శివారు ప్రాంతం కావడంతో చాలా మంది పేద ప్రజలు ఇక్కడ నివసిస్తుంటారని, వారి సమస్యలన్నిటిని దశలవారిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎల్‌ఎండీ రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యం పాటించాలని నీటిపారుదల శాఖ అధికారులను కోరారు. తాగునీటి అవసరాలకు జలాశయంలో నీటి సామర్థ్యం పాటించడం ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం బాధ్యత అన్నారు. జిల్లా యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకుంటేనే నగర ప్రజలకు తాగునీరు అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు కర్రె అనిల్‌కుమార్, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

రేపు హజ్ శిక్షణా కార్యక్రమం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 16: జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు రియాజ్ అలీ రజ్వీ అధ్యక్షతన నేషనల్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఉదయం 10-30 గంటల నుంచి హజ్ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎండి షఫియొద్దీన్, మసూద్‌అలీ, అక్బర్, ఫయాజ్‌అలీరజ్వీ, అక్రం అలీ, వాజిద్‌అలీ, షాదాబ్, ఫరీద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు 'భారతరత్నం పీవీ' అంశంపై ప్రసంగం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 16: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించిన సందర్భంగా నగరంలోని భగత్‌నగర్, బృందావన్ గార్డెన్‌లో శనివారం సాయంత్రం 5-30 గంటల నుంచి ప్రజ్ఞాభారతి, పీవీ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో 'భారత్ కిరీటంలో మెరిసిన భారతరత్నం పీవీ' అనే అంశంపై ప్రసంగాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయా సంస్థల బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ఎల్ రాజభాస్కరరెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, పీవీ తనయుడు పీవీ ప్రభాకరరావు, నేత్రవైద్య నిపుణుడు డాక్టర్ ఎస్‌వీ నవీన్ కుమార్, సామాజిక, రాజకీయ విశ్లేషకుడు భాస్కరయోగి, డి నిరంజనాచారి, కేవీ సంతోష్‌బాబు, ఎలగందుల సత్యనారాయణ, మందల నగేశ్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. పీవీ అభిమానులు, కవులు, రచయితలు పాల్గొనాలని కోరారు.

సహకార శాఖ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 16: జిల్లా సహకార శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జలాలోద్దీన్ అక్బర్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 డైరీని జిల్లా సహకార శాఖ అధికారి రామానుజాచార్యులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవో అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో టీఎన్‌జీవో, టీసీఎన్ జీవోలు ఎప్పుడు ముందుంటుదన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జలాలోద్దీన్ అక్బర్, కార్యదర్శి ప్రీతిపాల్ సింగ్, రాజమౌళి, అసోసియేట్ అధ్యక్షుడు కె అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి పర్వదినం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 16: మాఘ శుద్ధ సప్తమి సందర్భంగా రథసప్తమి పండుగను భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. సూర్య నమస్కారాలు, నదీస్నానాలు, అర్ఘ్యాలు, ఆలయాల సందర్శనలు, ఉపవాసాలు పాటిస్తూ వ్రతాలాచరించారు. ప్రమిదలను నదుల్లో వదిలారు. జప, హోమ, తర్పణాదులు, పితృదేవతారాధనలు, దానధర్మాదులు చేశారు. సూర్యునికి క్షీరాన్నం నైవేద్యంగా సమర్పించారు.

కరీంనగర్‌కు చేరిన తిరుమల లడ్డూలు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 16: జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో జరుగుతున్న సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంత్రి ప్రత్యేక చొరవ మేరకు తిరుమల నుంచి 15 వేల లడ్డూలు, పట్టు వస్త్రాలతో కూడిన ప్రత్యేక వాహనం శుక్రవారం రాత్రి ఆలయానికి చేరుకుంది. వాటిని ఆలయ వ్యవస్థాపక వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈఓ వుడుతల వెంకన్న, కార్యకర్తలు ఆలయ కార్యాలయంలో భద్రపరిచారు. లడ్డూలను కల్యాణం రోజున భక్తులకు వితరణ చేయనున్నారు.

కాంగ్రెస్ ఎంపీ టికెట్ బీసీలకు కేటాయించాలి



మాట్లాడుతున్న సిరిశెట్టి రాజేష్‌గౌడ్

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 16: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బీసీ అభ్యర్థికి అవకాశం కల్పించాలని బీసీ సంక్షేమసంఘం విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సిరిశెట్టి రాజేష్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని కోరారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బీసీకి అవకాశం ఇస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు. గతంలో వైయస్ రాజశేఖర్‌రెడ్డి బీసీలను గుర్తించి పొన్నం ప్రభాకర్‌కు టికెట్ కేటాయించడంతో అత్యధిక మెజార్టీతో గెలిచారన్నారు. అదే తరహాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కరీంనగర్లో పార్లమెంట్ అభ్యర్థ గా ఏఐసిసి జాతీయ కార్యవర్గ సభ్యుడు రుద్ర సంతోష్‌కుమార్‌కు టికెట్ కేటాయిస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 16: తెలంగాణ రాష్ట్ర ఐక్య కార్యాచరణ వేదిక పిలుపుమేరకు విద్యుత్ సంస్థ సర్కిల్ ఆఫీస్ ఆవరణలో విద్యుత్ ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ పాలసీలకు నిరసనగా దేశవ్యాప్తంగా రైతులు, కార్మికులు, ఉద్యోగులు చేస్తున్న ధర్నాలకు సంఘీభావంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటు చేయడం ద్వారా రైతులు, కార్మిక లోకం చాలా సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కె అంజయ్య, జేఏసీ నాయకులు భాస్కర్, నాయిని అంజ య్య, రఘు, కిరణ్, నలువాల స్వామి, వెంకటే శ్వరరావు, వెంకట్ నారాయణ, రామచంద్రం పాల్గొన్నారు.

భగత్‌నగర్: కేంద్ర ప్రభుత్వం నల్లా చట్టాలతో కార్మికుల కడుపుకొడుతుందని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బొమ్మడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన సమ్మెకు మద్దతు ప్రకటించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ బీజేపీ ప్రభు త్వం కార్మికులను నయవంచనకు గురిచేస్తుందన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్, రైల్వే ఎల్‌ఐసీ బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ రంగాలను ప్రైవేటుపరం చేస్తు కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తుందన్నారు.

తిమ్మాపూర్: కేంద్ర ప్రభుత్వ కార్మిక కర్షక వ్యతిరేక విధానాన్ని నిరసిస్తూ శుక్రవారం తలపెట్టిన దేశ వ్యాప్త బంద్‌లో భాగంగా మండల వ్యాప్తంగా సీఐటీయూ, ఏఐటీయూసీ, సీపీఎం, సీపీఐ కార్మిక సంఘాలు, ఇతర సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం ముందు కార్మిక సంఘాలతో పాటు ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ జిల్లా నాయకులు కేదారి, సంపత్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మాతంగి శంకర్ పాల్గొన్నారు. ఆటో యూనియన్ నాయకులు ఆటోలను నిలిపివేయంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

వీణవంక: మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ తిరుమల్ రావుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు పిల్లి రవియాదవ్ నాయకులు పాల్గొన్నారు.

శంకరపట్నం: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శంకరపట్నం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు కార్మికసంఘాలు ర్యాలీ నిర్వహించారు.

సైదాపూర్: సీఐటీయూ ఆధ్వర్యంలో బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ తీశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కదిరె రమేష్, పద్మ, శ్యామల, తిరుపతి పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలి
● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్



సమావేశంలో మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, ఫిబ్రవరి 16: వచ్చే పార్లమెంట్ ఎన్నికల కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేసినప్పుడే ఫలితాలు వస్తాయన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి లక్ష మెజార్టీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఇవ్వాలన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటానన్నారు. కష్టపడ్డ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. గ్రామాల్లోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే ముఖ్యమంత్రి మంత్రులతో మాట్లాడి వాటిని పరిష్కరిస్తారన్నారు. సమావేశంలో గూడూరు స్వామిరెడ్డి, సొల్లు బాబు, పత్తి కృష్ణారెడ్డి, దేశిని అయిలయ్య, వేముల పుష్పలత, స్వామిగౌడ్, తునికి రవి, కె శంకర్, సునీత, శ్రీనివాస్‌గౌడ్, దశరథం పాల్గొన్నారు.

● హుజూరాబాద్ పట్టణ శివారులోని రంగనాయకుల గుట్ట వద్ద జరిగే శ్రీసమ్మ క్క-సారలమ్మ జాతర పోస్టర్‌ను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆవిష్కరించారు. హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో అనాథ పిల్లల జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి వొడితెల ప్రణవ్ హాజరై కేక్ కట్ చేశారు. అనాథ పిల్లల చదువుల నిమిత్తం రూ. 25వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో లత, జ్యోతి, సరళ, అమూల్య, ఖాజాబీ, రజిత పాల్గొన్నారు.

కష్టపడిన వారికే నామినేటెడ్ పోస్టులు

జమ్మికుంట: పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి నామినేటెడ్ పోస్టుల్లో గుర్తింపు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో గల హిందుశ్రీ ఫంక్షన్‌హాల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యతిధిగా హజరైన ప్రణవ్ మాట్లడుతూ హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్‌ను ఓడించింది మనమే అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో హుజూరాబాద్ నుంచి లక్ష మెజార్టీ సాధించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. సమావేశంలో పిసిసి మెంబర్ పత్తి కృష్ణారెడ్డి, నాయకులు కసుబోజుల వెంకన్న, సుంకరి రమేష్, పూదరి రేణుక-శివకుమార్‌గౌడ్, పొనగంటి మల్లయ్య ఉన్నారు.

జమ్మికుంట కమిషనర్‌గా మహమ్మద్ అయాజ్

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 16: జమ్మికుంట మున్సిపల్ కమిషనర్‌గా మహమ్మద్ అయాజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 30వార్డుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడుతామన్నారు.

బాధ్యతలు స్వీకరించిన జమ్మికుంట సీఐ

జమ్మికుంట, ఫిబ్రవరి 16: జమ్మికుంట పట్టణ సీఐగా వరగంటి రవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రామగుండం కమిషనరేట్ నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలకు సమస్య వస్తే నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తనను కలువాలని, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని సూచించారు. అక్రమ ఇసుక రవాణ, ట్రాఫిక్ సమస్యపై దృష్టి పెడుతామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే ఎంతటి వారిని అయినా వదిలి పెట్టే ప్రశక్తి లేదన్నారు. కోరారు.

ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలి

గన్నేరువరం, ఫిబ్రవరి 16: ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని అన్ని గ్రామాల అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు సీపీఐ నాయకులతో కలిసి శుక్రవారం మండల కేంద్రంలో నిరసన తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి పలు వ్యాపార సంస్థలను మూసివేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో తమ శ్రమను దోచుకున్నారని, కుటుంబ పోషణకు కూడా సరిపోని జీతాలతో కాలం వెళ్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అంగన్‌వాడీలకు, ఆశాలకు సరైన వేతనాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, అంగన్‌వాడీలు ఉన్నారు.

కుల బహిష్కరణపై సీపీకి ఫిర్యాదు

మానకొండూర్, ఫిబ్రవరి 16: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన మాదాసు సంపత్ అనే వ్యక్తి తనను గ్రామంలో కుల బహిష్కరణ చేశారని ఇటీవల కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతికి ఫిర్యాదు చేశారు. కాగా ఈ విషయంపై స్థానిక సీఐ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా సీపీకి పిర్యాదు చేసింది వాస్తవమేనని పిర్యాదుపై విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు.

గర్షకుర్తిలో మరమగ్గాల కార్మికులు ధర్నా



గర్షకుర్తిలో ధర్నా చేస్తున్న మరమగ్గాల కార్మికులు, నాయకులు

గంగాధర, ఫిబ్రవరి 16: గర్షకుర్తి మరమగ్గాల కార్మికులపై జౌళిశాఖ అధికారులు పెట్టిన కేసులను ఎత్తివేయాలని కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. కార్మికులు, కార్మిక సంఘం నాయకులు ప్లకార్డులతో గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించి గ్రామ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో 1400 మగ్గాలుంటే అధికారుల బెదిరింపులతో కేవలం 200 మాత్రమే నడుస్తున్నాయి. గత పదేళ్లుగా రాని అధికారులు గ్రామంలో దాడులు చేసి కేసులు పెట్టారని వాటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మరమగ్గాలకు ఉచితంగా 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నేతన్నలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. హ్యాండ్‌లూమ్స్ రిజర్వేషన్ ఆఫ్ ఆర్టికల్స్‌ఫర్ ప్రొడక్షన్ అక్ట్ 1985 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.బతుకమ్మ చీరెల ఆర్డర్లను వెంటనే అమలు చేయాలని కోరారు. గర్షకుర్తికి బతుకమ్మ చీరెల పెం డింగ్ బిల్లు 8 కోట్లు విడుదల చేయాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి
- అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 16: జిల్లాలో ఈనెల 28 నుంచి మార్చి 16వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జి.జగన్మోహన్‌రెడ్డితో కలిసి వివిధశాఖల అధికారులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఈయర్ పరీక్షలు ప్రశాంతంగా, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల కోసం 56 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఫస్ట్‌ఈయర్‌లో 16,590 మంది, సెకండ్ ఈయర్ పరీక్షలకు 16,959 మంది విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు కె.రవీందర్‌రెడ్డి, వి.అంజనేయరావు, హెచ్‌పిసి మెంబర్ మధుమోహన్‌రావు, డీఈవో జనార్ధన్‌రావు, డీఎఫ్‌వో వెంకన్న పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

భగత్‌నగర్: నగరంలోని ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు డిమాండ్ చేశారు. వ్యాపారులు ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు చేస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

కరీంనగర్ రూరల్: మండలంలోని దుర్శేడ్ రైతువేదికలో రైతులకు వరి మొక్కజొన్న పంటలలో చీడపీడల నివారణ, అధిక రసాయన ఎరువుల వాడకంపై, నష్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయాధికారి ప్రియదర్శిని, సహాయ సంచాలకులు రణధీర్, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మంజులత, వ్యవసాయాధికారి బి సత్యం పాల్గొన్నారు.

- నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని సమ్మక్క సారమ్మ దేవతలకు బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు డాక్టర్ పి సుజాతారెడ్డి ఒడిబియ్యం, నూతన వస్త్రాలు సమర్పించారు.
- నగరంలోని 19వ డివిజన్ పరిధిలోని రేకుర్తి కంటి ఆసుపత్రి సమీపంలో పునర్నిర్మాణం చేసిన పోచమ్మ ఆలయం ప్రారంభోత్సవంలో మేయర్ సునీల్‌రావు, కార్పోరేటర్ రాజశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హౌజింగ్ బోర్డు కాలనీలో నిర్వహించే సమ్మక్క జాతరను బొమ్మకల్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించాలని సీనియర్ దళిత నాయకుడు గోష్కి శంకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గాలిపెల్లి శ్రీనివాస్ కోరారు.

గణేశ్‌నగర్: ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలకు పీవీ నరసింహారావు తుక్కారావు చిత్రపటాలను డాక్టర్ గిరిధర్ రావు, చంద్ర ప్రభాకర్, ప్రకాష్ హొల్లాని బహూకరించారు. వారిని కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ అభినందించారు.

- ఎస్‌యూ సమగ్ర అభివృద్ధికి, తాత్కాలిక ఉద్యోగుల నమోదుకు, సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఈసీ సభ్యులు తెలిపారు. తాత్కాలిక ఉద్యోగుల ప్రయోజ నాల దృష్ట్యా వారిని ఔట్ సోర్సింగ్ లోకి అనుమతించే ప్రక్రియ వేగవంతంగా జరగాలని, వారి నమోదు ప్రక్రియకు మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు.

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఆదర్శ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి సీఈవో డాక్టర్ సత్యనారాయణరెడ్డిని ఆర్‌బీవీఆర్‌ఆర్ సభ్యులు సన్మానించారు. శుక్రవారం ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో సభ్యులు మాట్లాడుతూ ఆర్‌బీవీఆర్‌ఆర్ సంఘంలో సభ్యత్వం ఉన్నవారికి ఉచిత ఓపీ సేవలు అందించడంపై హర్షం వ్యక్తం చేశారు.

కరీంనగర్ అర్బన్: యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులుగా అట్ల అనిల్‌ముదిరాజ్, ఎండీ నవాజ్,ప్రధాన కార్యదర్శులుగా తోర్తి అరవింద్, మీర్జా ముభాషిర్‌బేగ్, కార్యదర్శులుగా జాప శ్రావణ్‌రెడ్డి, ఎండీ జాఫర్ ఖాన్, ఎండీ సాజిద్‌ఉద్దీన్, గజన్‌నాయక్‌ను నియమించినట్టు జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు.

● రామడుగు : అధికారుల అనుమతి లేకున్నా కొంతమంది ఎల్లంపల్లి పైపులైన్ గేట్ వాల్‌లను ధ్వంసం చేయగా నీరు వృథాగా పంటపొలాల్లో పారు తుండటంతో నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గోపాల్‌రావుపేటకు సమీపంలోని ఎల్లంపల్లి పైప్‌లైన్ మీద ఉన్న రెండు గేట్‌వాల్ ధ్వంసం చేయడంతో నీరంతా వృథాగా పోతుందన్నారు.

● జమ్మికుంట: దేశ వ్యాప్తంగా జరుగుతున్న అన్ని కార్మిక సంఘాలతో తాము పాల్గొంటున్నట్లు మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు శుక్రవారం ఏఈ వరుణ్‌కు వినతిపత్రం అందజేశారు.

● హుజూరాబాద్: చెవెళ్ల నియోజక వర్గంలోని జన్వాడ గ్రామంలో ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నాయకులు చర్చిపై చేసిన దాడిని ఖండిస్తున్నామని జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు అన్నారు. శుక్రవారం హుజూ రాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు.

● మానకొండూర్ : మండలంలోని పచ్చునూర్ గ్రామ శివారులోని ఎస్సారెస్పీ 4ఎల్ ఉపకాల్వకు గురువారం గండి పడింది. దీంతో నీరంతా వృథాగా పోతూ పంట పొలాల్లో చేరడంతో పంటలు దెబ్బతిన్నాయి. ఉపకాల్వకు గండిపడ్డ సమాచారం శుక్రవారం సంబంధిత అధికారులు తెలియజేయడంతో సంఘటనా స్థలానికి చేరుకొని మరమ్మతులు చేపట్టారు.

● హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖా దికారిణి డాక్టర్ సుజాత అన్నారు. స్నేహిత ఫేజ్-1 సురక్షిత బాల్యంపై అవగాహన కార్యక్రమం దమ్మక్కపేట మైనార్టీ గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్, రాజాపల్లి గ్రామాల్లో వరి పంట క్షేత్రాలను శుక్రవారం ఏవో సునీల్‌కుమార్ పరిశీలించారు.

● హుజూరాబాద్:: హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఐఏయూవైఎస్‌ఏ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు పవన్, చటర్జీ, అఖిల్‌లు పాల్గొన్నారు.

● వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన మహాగణపతి పార్వతిదేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల శిఖర ధ్వజస్తంభ కార్యక్రమము నిర్వహించారు. కార్యక్ర మంలో ఆలయ చైర్మన్ వాల బాలకిషన్‌రావు ఉన్నారు.

● గంగాధర: విద్య ప్రమాణాలు మెరుగుపరుచుకుని ఉన్నతంగా ఎదిగి పాఠశాలకు, తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలని బీఆర్‌ఎస్ నాయకుడు కంకణాల విజేందర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం గట్టుభూత్కూర్ ప్రభుత్వ పాఠశాలలో స్నేహిత కార్యక్రమాన్ని నిర్వహించారు.

● గంగాధర: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఆశా కార్యకర్తలు తహసీల్దార్ రమే ష్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భం గా వారు కనీసం వేతనం 26వేలు ఇవ్వాలన్నారు.

● రామడుగు: మండల అభివృద్ధికి అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి సమన్వయంతో పని చేయా లని ఎంపీపీ కలిగేటి కవిత అన్నారు. మండలానికి నూతనంగా వచ్చిన ఎంపీడీవో రాజేశ్వరిని ఆమె సన్మానించారు.